క్లుప్తంగా

రేణుకా యల్లమ్మకు వజ్రాల ముక్కు పుడక బహూకరణ

డోన్ టౌన్: మండల పరిధిలోని ఉడుముల పాడు గ్రామ సమీపంలో కొలువైన శ్రీరేణుకా యల్లమ్మకు గురువారం పట్టణానికి చెందిన దివంగత నాయకుడు ఆర్ఈ రవికుమార్ కుటుంబ సభ్యులు వజ్రాల ముక్కు పుడకను బహుకరించారు. రూ. 1.50లక్షల వజ్రాల ముక్కు పుడుకను అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు విరాళం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని పాటిమీద వెలసిన ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు కోవెలకుంట్లకు చెందిన రిటైర్డ్ అధ్యాపకుడు గోపిరెడ్డి నాగిరెడ్డి గురువారం విరాళమిచ్చారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా రూ. 10 వేలను ఆలయ కమిటీ సభ్యులు పవన్ శ్రీనివాసరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డికి అందజేశారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

సంజామల(కోవెలకుంట్ల):సంజామల మండలం ముదిగేడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి గడపను సందర్శించి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తారన్నారు. అలాగే గ్రామంలో రూ. 35 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు హైజిన్ కిట్ల పంపిణీ

సంజామల(కోవెలకుంట్ల):సంజామల మండలం పేరుసోముల గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు గురువారం హైజిన్ కిట్లను పంపిణీ చేశారు. నంద్యాలకు చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కార్యవర్గ సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు అభినందించ దగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివవిక్రమ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నరసింహమూర్తి పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని విఠలాపురం గ్రామానికి చెందిన వెంకట రమణారెడ్డిపై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి గురువారం తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వరరెడ్డి తనస్థలంలో పశువుకొట్టం వేసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డి పాతకక్షలను మనసులో పెట్టుకొని పశువుల షెడ్డు తన స్థలంలో ఉందని, పశువులను బయటికి పంపి షెడ్డుకు తాళం వేసుకున్నారు. వెంకటేశ్వరరెడ్డి, అతని భార్య లక్ష్మీదేవి ఎందుకు తాళం వేశారని వెంకటరమణారెడ్డి, అతని భార్య ఉషారాణిలను ప్రశ్నించారు. దీంతో వెంకటరమణారెడ్డి,ఉషారాణి తమపై దాడికి పాల్పడ్డారని బాధితులు వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీదేవి ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిద్దాం

డోన్ టౌన్: పట్టణంలోని 4,5వ సచివాలయాల పరిధిలోని కౌన్సిలర్లు, గృహ సారథులు, వలంటీర్లు సమావేశం జగనన్నే మా నమ్మకం కార్యక్రమంపై సమావేశమయ్యారు. ఆయా సచివాలయాల్లో నిర్వహించిన సమావేశాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉందని కౌన్సిలర్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కురకుందు హరి, కటికె వేణు, మౌలాబీ, కో ఆప్షన్ మెంబర్ రఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు మేడా రఘు, హరీష్, దుబాయ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరులోని కొత్తపేట కాలనీలో గ్రామానికి చెందిన సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. మొదటి రోజు ఆయన ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ మోడల్ స్కూలు వద్ద లెజెండ్‌వేణు యూత్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ షమీల, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు ప్రారంభించారు. పానకం, మజ్జిగ పంపిణీ చేశారు.

ముగిసిన బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని నేరేడుచెర్లలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలు గురువారం ముగిశాయి. బేతంచెర్ల మండలం గోర్లగుట్టకు చెందిన బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, అనంతపురం జిల్లా చక్రయపేటకు చెందిన రవీంద్రనాథ్ రెడ్డి వృషభాలు సంయుక్తంగా విజేతలుగా నిలిచి రూ. 50 వేలు కైవసం చేసుకున్నాయి. అనంతపురం జిల్లా ఊబిచెర్లకు చెందిన పులం గోవిందు వృషభాలు ద్వితీయ స్థానంలో రూ.30 వేలు, పెచ్చులపాటు, పీఆర్‌పల్లి గ్రామాలకు చెందిన శివకోటి, భీమలింగప్ప వృషభాలు తృతీయ స్థానంలో రూ. 20 వేలు, అనంతపురం జిల్లా కొత్తపేట బాలాజీ వృషభాలు నాలుగో స్థానంలో రూ.10 వేలు, హుసేనాపురం వెంకటేశ్వర్లు, రామసుబ్బారెడ్డి వృషభాలు ఐదోస్థానంలో నిలిచి రూ.5 వేలు చొప్పున గెలుపొందాయి.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా పేదలకు ప్రభుత్వ ఫలాలు
- హామీలన్నింటినీ నెరవేర్చాం ... మీ ముందుకు వచ్చాం
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి బుగ్గన



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ : కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తుందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చామని, సంక్షేమ పథకాల అమలు తీరుతోపాటు ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మీ ముందుకు వచ్చామన్నారు. పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలోని 16వ వార్డులో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో గురువారం సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు దినేష్‌గౌడ్ నేతృత్వంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అదేవిధంగా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బ్రోచర్‌ను కౌన్సిలర్లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలలో 97 శాతం హామీలను ప్రభుత్వం ఇప్పటికే నెరవేర్చిందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూర్చామన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే సంబంధిత కౌన్సిలర్లు, వలంటీర్ ద్వారా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉంటే కచ్చితంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు అందజేయడంతోపాటు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ప్రజలకు ఇచ్చినవాటితోపాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేశామని, ఆ నమ్మకంతోనే తిరిగి ప్రజల ముందుకు ధైర్యంగా రాగలుగుతున్నామని మంత్రి బుగ్గన స్పష్టం చేశారు. మోడల్ నియోజకవర్గంగా డోన్‌ను తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహాయ సహకారాలను ఈ సందర్భంగా మంత్రి ప్రజలకు వివరించారు.

మంత్రికి ఘన స్వాగతం

16వ వార్డును సందర్శించిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ వాల్మీకి మహేంద్రనాయుడు ఆధ్వర్యంలో ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు మంత్రిపై పూల వర్షం కురిపించారు. అదేవిధంగా గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, నాయకులు భాస్కర్, డంకేష్, రమేష్, భరత్‌వల్లి, దూదేపీరా, రవి, మధు, అయ్యస్వాములు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికలు

- మూడవసారి అధ్యక్షునిగా ఎన్నికైన కమలాపురం రేగటి రాజశేఖర్‌రెడ్డి
- అభినందనలు తెలిపిన మంత్రి బుగ్గన


కమలాపురం రేగటి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షుడు


శేషశయనారావు, ప్రధాన కార్యదర్శి


శివరామకృష్ణ, ఉపాధ్యక్షుడు


బార్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ : ప్రతిష్టాత్మకంగా జరిగిన డోన్ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ముగిశాయి. ప్రస్తుత అధ్యక్షుడు కమలాపురం రేగటి రాజశేఖర్‌రెడ్డి మూడవసారి ఘన విజయం సాధించారు.ఈయన ప్యానల్ కార్యవర్గమంతా ఎన్నిక కావడం విశేషం. గతంలో ఎంతో ప్రశాంతంగా నిర్వహించుకునే బార్ అసోసియేషన్ ఎన్నికలను ఈసారి టీడీపీకి చెందిన బయటి వ్యక్తులు రాజకీయం చేయడం, కొందరిని ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించడంతో నువ్వా ..నేనా అన్నట్లుగా ఎన్నికలు జరిగాయి. ఎట్టకేలకు న్యాయవాదులంతా తమకు సబ్‌కోర్టు మంజూరు చేసేందుకు సహకరించిన రేగటి రాజశేఖర్‌రెడ్డి ప్యానల్ అభ్యర్థులందరినీ గెలిపించారు. అధ్యక్షుడిగా రేగటి రాజశేఖర్‌రెడ్డి సమీప ప్రత్యర్థి కల్లా మహేశ్వరరెడ్డిపై 55 ఓట్లతో, ప్రధాన కార్యదర్శిగా శేషశయనారావు ప్రత్యర్థి ప్రసాద్‌పై 47 ఓట్లు, కోశాధికారిగా మంగమూరి శ్రీనివాసులు ప్రత్యర్థి పులి దామోదర్‌పై 40 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అంతకుముందు రాజశేఖర్‌రెడ్డి ప్యానల్‌కు చెందిన ఉపాధ్యక్ష స్థానానికి బోయ శివరామకృష్ణ, సహాయ కార్యదర్శి స్థానానికి రంగడు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో పైమూడు స్థానాలకు పోలింగ్ అనివార్యమైంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపాల్‌రెడ్డి అభ్యర్థుల విజయాలను ప్రకటించారు.

మంత్రి అభినందన

వరుసగా మూడుసార్లు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికైన ప్రస్తుత మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు కమలాపురం రేగటి రాజశేఖర్‌రెడ్డిని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అభినందించారు. ఎన్నిక అనంతరం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులతో కలిసి మంత్రి స్వగృహానికి వెళ్లగా ఆయన న్యాయవాదులను పేరుపేరునా పరిచయం చేసుకొని విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్ జేసీఓ మృతి

కోవెలకుంట్ల: హైదరాబాద్‌లోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో జూనియర్ వారెంట్ ఆఫీసర్(జేసీఓ)గా పనిచేస్తున్న కోవెలకుంట్లకు చెందిన సంబటూరి రంగాచార్యులు(57) మృతి చెందాడు.పట్టణానికి చెందిన ఈయన 1986వ సంవత్సరం నుంచి ఎయిర్‌పోర్స్‌లో జేసీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక బుధవారం మృత్యువాత పడ్డారు. ఈ మేరకు ఎయిర్‌పోర్స్ అధికారులు సైనికలాంఛనాలతో గౌరవ వందనం సమర్పించి నివాళులర్పించారు. గురువారం ఉదయం పార్థీవదేహాన్ని స్వగ్రామమైన కోవెలకుంట్లకు తీసుకొచ్చారు. ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

అందుబాటులోకి మెరుగైన వైద్యం

కోవెలకుంట్ల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ విద్యాసాగర్ అన్నారు. గురువారం మండలంలోని సొదరదిన్నెలో గ్రామ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసిందన్నారు. నాడు- నేడు కార్యక్రమం ద్వారా ఆసుపత్రుల రూపురేఖలు మారిపోయాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పక్కీర్‌స్వామి ఉరుసు

బనగానపల్లె : మండలంలోని బత్తులూరుపాడు గ్రామంలో శ్రీ పక్కీర్‌స్వామి దర్గా ఉర్సు మహోత్సవం గురువారం గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. సాయంత్రం స్వామివారికి గంధం, జెండా ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సతీమణి కాటసాని జయమ్మ, కుమారుడు కాటసాని ఓబులరెడ్డి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు అంబటిరవికుమార్ రెడ్డి, కైప ప్రతాప్‌రెడ్డి,శంకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కిశోర్ పాల్గొన్నారు.

కన్వీనర్లు బాధ్యతగా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చలం రెడ్డి

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్లు బాధ్యతగా పనిచేయాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలో సర్పంచ్ గుమ్మగాల్లరాజు, ఉప సర్పంచ్ సత్యం రెడ్డి మండల సచివాలయ కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులతో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మీ పరిధిలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఎక్కడైనా పథకాల అమలులో అభ్యంతరాలు, చేర్పులు, మార్పులునా తమ దృష్టికి తీసుకరావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. అదేవిధంగా బేతంచెర్ల పట్టణంలోని 1వ సచివాలయంలో పట్టణ సచివాలయ కన్వీనర్ అజాంబాషా ఆధ్వర్యంలో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో చైర్మన్ చలం రెడ్డి, వార్డు కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, షేక్ ముబీనా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, నాయకులు బాయికాటి మోహన్‌రెడ్డి, తిమోతి, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లెరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లు, గృహ సారథులదే అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ఓబులరెడ్డి అన్నారు. గురువారం స్థానిక పొదుపు భవనంలో పట్టణంలోని ఐదు సచివాయాల బూత్ కన్వీనర్లు, గృహసారథులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని ఓబులరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి పనులతో పాటు అదే స్థాయిలో సంక్షేమ పథకాలను అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పార్టీలకు అతీతంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మేలు చేస్తుంటే ఓర్వలేని కొన్ని పచ్చపత్రికలు వక్రీకరిస్తూ రాయడం సిగ్గు చెట్టని, ఇలాంటి దుష్ప్రచారాన్ని బూత్ కన్వీనర్లు, గృహసారథులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం మా నమ్మకం నీవే జగన్ కిట్లను బూత్ కన్వీనర్లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు అత్తార్ జాహెద్ హుస్సేన్, భానుముక్కల సహకార సంఘం చైర్మన్ నీలిశ్రీనివాసులు, జీటి వెంకట్రామిరెడ్డి, ఈసారి యల్లయ్య, కిశోర్, పోలూరు వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

కొలిమిగుండ్ల: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరక్టర్ సత్యనారాయణ సూచించారు. మండల పరిధిలోని తుమ్మలపెంట సమీపంలోని లేఅవుట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కాలనీలో విద్యుత్, నీటి సౌకర్యం ఏర్పాటు చేశారని, త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అంకిరెడ్డిపల్లె,క నక్కాద్రివల్లెలోని ప్రాథమిక పాఠశాలల్లో నాడు-నేడు పథకం కింద మొదటి విడతలో చేసిన పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బరాజు, హౌసింగ్ ఏఈ మద్దిలేటి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: జగనన్న కాలనీల్లో పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా సూచించారు. గురువారం పట్టణ శివారులోని జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వం మూడు విడతల్లో రూ. 1.80 లక్షల బిల్లులు చెల్లిస్తోందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాధిక, హౌసింగ్ ఏఈ సుదర్శన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం


సీతారాముల రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బేతంచెర్ల : మండల పరిధిలోని సిమెంటునగర్‌లో పర్వత వర్ధిని రామనాథేశ్వర ఆలయంలో వెలసిన సీతారాముల ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం రాత్రి నిర్వహించిన రథోత్సవం కనుల పండువగా సాగింది. పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెక్కభజన ఆకట్టుకుంది. కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ నరసింహారెడ్డి, ఫ్యాక్టరీ జీఎం రాఘవరెడ్డి, గ్రామస్తులు యాకోబ్, నాగశంకర్, సత్యం, మహేష్, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజల చెంతకే వైద్య సేవలు


వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లెరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజల చెంతకే వైద్య సేవలు అందుతాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. గురువారం అవుకు మండలం ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , బనగానపల్లె మండలం టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ 104 వాహనాలను ఎమ్మెల్యే కాటసాని తన స్వగృహం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో వైద్య సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కింద మీ ఊరి వద్దకే డాక్టర్లను పంపి వైద్య సేవలందించేలా చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టంగుటూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మధుమౌనిక, ఉప్పలపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వినోద్ కుమార్, యమునా, హెల్త్ సూపర్ వైజర్లు విజయ కుమార్, చక్రవర్తి, కమాల్‌సాహెబ్, వేనుగోపాల్‌రాజు, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


సమావేశానికి తరలివచ్చిన మహిళలు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

బనగానపల్లె: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో గురువారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. మండలానికి మూడవ విడతగా విడుదలైన రూ.10.79 కోట్ల మెగా చెక్కును వారు పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నియోజకవర్గానికి మూడు విడతలుగా రూ.84.90 కోట్లు నిధులు విడుదల కాగా బనగానపల్లె మండలానికి మూడు విడతలుగా 1499 గ్రూపులకు రూ.32.37 కోట్లు విడుదల అయ్యాయని గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వం పొదుపు రుణాలు మాఫీ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకపోగా 2016 నుంచి సున్నా వడ్డీ పథకాన్ని ఎగ్గొట్టడం మూలంగా సుమారు 3.036కోట్ల వడ్డీని అక్క చెల్లెమ్మలే బ్యాంకులకు అపరాధ వడ్డీతో సహా చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు 2019 ఏప్రిల్ 14 నాటికి ఉన్న రూ. 25.571 కోట్ల అప్పును నాలుగు విడతలుగా చెల్లించడం జరుగుతుందని ఇచ్చిన హామీని అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజల వైద్య సౌకర్యం కోసం బనగానపల్లెలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడి రూ.22 కోట్లు మంజూరు చేయించి నిర్మిస్తున్నామని, త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. బనగానపల్లెలో రూ.4 కోట్లతో ఫోర్‌లైన్స్ నిర్మాణ పనులు, త్రాగునీటి సమస్యలేకుండా నియోజవర్గంలో రూ.80 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ 2019 నాటికి రాష్ట్రంలో 39 లక్షల మంది పింఛన్‌దారులు ఉండగా నేడు 63 లక్షలకు చేరాయని గుర్తు చేశారు. నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడుతున్నాయని, ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా మౌలిక వసతులు సమకూర్చామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ, కుమారుడు కాటసాని ఓబులరెడ్డి ఉద్దేశించి మాట్లాడారు. టీడీపీ వైఎస్సార్‌సీపీ పాలన వ్యత్యాసాలను ప్రజలు గుర్తించాలన్నారు. నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముందుకు సాగుతున్నారని, ప్రతిఒక్కరూ సహకారం అందజేయాలని పిలుపునిచ్చారు.

ఓర్వలేకనే అడ్డంకులు...

నియోజకవర్గ ప్రజలకు మంచి చేస్తుంటే ఓర్వలేక టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అడ్డంకులు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. బనగానపల్లె పట్టణంలో ఇళ్లలేని పేదలకు మూడువేల ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు తాను సర్వం సిద్ధం చేయగా ఓర్వలేని మాజీ ఎమ్మెల్యే బీసీ ఎస్ఆర్‌బీసీ కెనాల్ సాకుగా చూపి కోర్టును ఆశ్రయించి ఇళ్ల స్థలాలు పంపిణీ జరగకుండా స్టే తెప్పించారన్నారు. అదే విధంగా కొలిమిగుండ్ల మండలంలో పేదలకు భూ పంపిణీ చేసేందుకు తాను చర్యలు తీసుకోగా మళ్లీ బీసీ కోర్టు ద్వారా స్టే పొంది అడ్డుకోవడం ఆయన నీచరాజకీయానికి నిదర్శనమన్నారు. న్యాయపరంగా పోరాటం చేసి తప్పక ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని సోదరులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసానితిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర కుర్ని సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామలదేవి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు అత్తార్ జాహెద్ హుస్సేన్, అబ్దుల్‌ఫైజ్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, ఎంపీపీ మానసవీణ, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీసుబ్బమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, ఎంపీడీఓ శివరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, వెలుగు ఏపీఎం తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండ్లమెట్ట వేలంపాటలో రభస

అవుకు : మండల పరిధిలోని రామాపురంలో గురువారం నిర్వహించిన బండ్లమెట్ట వేలంపాటలో రభస చోటు చేసుకుంది. గతనెల 29న గ్రామపంచాయతీ అధికారులు మార్కెట్, బండ్లమెట్టకు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో మార్కెట్ రూ.2.15లక్షలకు పాడినారు. అయితే బండ్లమెట్ట రూ.6.62లక్షలు సర్కారు వారిపాట ఉండటంతో ఎవ్వరూ ముందుకు రాలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బండ్లమెట్టను రూ.4.50లక్షలను సర్కారువారి పాటగా నిర్ణయించారు. ముగ్గురు డిపాజిట్ చేసుకున్నారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, చక్రపాణిలు వేలంపాటను ప్రారంభించారు. రాజశేఖర్ రెడ్డి అనే డిపాజిటర్ రూ.4.51లక్షలు పాటపాడాడు. శివార్జున, రవి అనే ఇద్దరు డిపాజిటర్లు డ్రాప్ అయ్యామని అనడంతో ఇలా ఎలా డ్రాప్ అవుతారని పలువురు మాటలు కలుగజేసుకున్నారు. రాజశేఖర్ రెడ్డితోపాటు మరో కొంతమంది టీడీపీ నాయకులు కలిసి మిగతా డిపాజిటర్‌లను బెదిరించి వేలంపాట పాడనివ్వలేదని గ్రామస్తులు ఆరోపించారు. దీంతో మాటలు పెరిగి గొడవకు దారితీస్తున్నదని అధికారులు పంచాయతీకి ఆదాయం రాకపోతే వేలంపాటను రద్దు చేయవచ్చని, అంతేకాకుండా ఈ వేలంపాటలో గొడవలు అవుతున్నాయని వెంటనే వేలంపాటను రద్దు చేసినట్లు ఈఓఆర్డీ తెలిపారు. గొడవలు పెరిగి ఇరువర్గాల వారు ఒకరిని ఒకరు తోచుకున్నారు. వెంటనే పోలీసులు కలుగజేసుకొని ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. ఒక వర్గానికి చెందిన రాజశేఖర్ రెడ్డి, పుల్లారెడ్డి, చిన్నారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మరో వర్గానికి చెందిన ప్రమోద్ గౌడ్, ప్రకాశ్ గౌడ్, మహేష్ గౌడ్‌లపై కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నామని తీసుకున్నామని ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు.

గోండ్రవాగులో నిలిచిన లారీ

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం కానాల సమీపంలో గోండ్రవాగులో గురువారం లారీ ఆగిపోయింది. గిద్దలూరువైపు నుంచి జొన్నపొట్టు లోడుతో వస్తున్న భారీ లారీ వాగు లోవెల్ కల్వర్టు దాటే క్రమంలో కట్టలు ఊడిపోవడంతో నిలిచిపోయింది. ఇరుకైన కల్వర్టు కావడంతో ఈ రహదారిలో రాకపోకలు స్తంభించిపోయాయి. మండల కేంద్రం సంజామల ప్రభుత్వ, కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. వాగులో లారీ ఆగిపోవడంతో వివిధ గ్రామాల నుంచి పరీక్షా కేంద్రాలకు వచ్చేందుకు విద్యార్థులు అవస్థలు పడ్డారు. రెడ్డిపల్లె, ఆల్వకొండ మీదుగా దాదాపు 20 కిమీ చుట్టు తిరిగి పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు.